# వ్యాస కౌముది



## చాటువులు

- డా. దూర్వాసుల వేంకట సుబ్బారావు



(క్రిందటి సంచిక నుంచీ)

ఆటవెలదులంటే ఇష్టమైన శ్రీనాధుడు జంగమ, చాకలి, కాసలనాటి, శబర, పూజారి స్త్రీలపై ఇలా చాటువుల్లో చెప్పాడు.

*పూజారి వారి కోడలు*
*తాజాగ బిందె జారి దబ్బున బడియెన్*
*మై జారు కొంగు దడసిన*
*బాజారే తిరిగి చూసి పక్కున నవ్వెన్*

దక్షిణాదికి వెళ్ళి ఏమన్నాడంటే

*మేత గరి పిల్ల పోరున మేకపిల్ల*
*పారుబోతు తనంబున బంది పిల్ల*
*ఎల్ల పనులను జెఱుపంగ బిల్లిపిల్ల*
*అందమున గ్రోలి పిల్ల యీ యఱవపిల్ల*

బోగి శ్రీనాధుడు రేనాటి వంటకాలు తినలేక శివుణ్ణి ఇలా ఆక్షేపించాడు

*గరళము మ్రింగితి నంచుం*
*బురహర! గర్వింపబోకు! పో!పో!పో! నీ*
*బిరుదింక గానవచ్చెడి*
*మెఱసెడి రేనాటి జొన్న మెదుకులు తినుమీ!*

నీటి సదుపాయం సరిగ్గా లేనందున శివుణ్ణే ఈ విధంగా ఎత్తిపొడిచాడు

*సిరిగల వానికి చెల్లును*
*తరుణులు పదియారు వేల తగు పెండ్లాడన్*
*తిరిపెమునకు కిద్దరాండ్రా*
*పరమేశా గంగ విడుము పార్వతి చాలున్!*

అంతభోగి తన అవసాన దశలో బొడ్డుపల్లెలో వ్యవసాయము చేసి నష్టపోయి 700 పన్నుకట్టలేని దుస్థితిలో ఏమన్నాడంటే

*కవిరాజ కంఠంబు కౌగలించెను గదా! పురవీధి నెదురెండ పొగడదండ*
*....... బిలబిలాక్షులు తినిపోయే దిలలు పెసలు*
*బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి*
*నెట్టు చెల్లింతు డంకంబు లేదు నూర్లు!*

అలాగే తనదైన బాణిలో సీస పద్యంలో తన ఆఖరి దశని ఇలా చెప్పుకున్నాడు

*కాశికా విశ్వేశు గలిసె వీరారెడ్డి రత్నాంబరంబు లేరాయడిచ్చు*
*...భాస్కరుడ మన్నె దేవుని పాలికరిగె..*
*దివిజ కవివరు గుండియెల్ దిగ్గురనగ*
*నరుగు చున్నాడు శ్రీనాథుడమరపురికి*

శ్రీనాథుని వలె అదే విధంగా కృష్ణదేవరాయల అష్టదిగ్గజాలలో ఆరాధ్యుడు పెద్దన తన చరమావస్థని ఈ విధంగా చెప్పుకున్నాడు.

*ఎదురైన చోదన మద కరీంద్రము నిల్పి కేలూతమొసగి యెక్కించుకొనియె*
*మను చరిత్రంబందుకొనువేళ బురమేగ బల్లకి దనకేలబట్టి యెత్తె*
*గోకట గ్రామాద్యనేకాగ్రహారంబు లడిగిన సీమలందు నిచ్చె*
*బిరుదైన గండపెండేరమున కీవ తగుదని తానె పాదమున దొడిగె*

*ఆంధ్ర పవితా పితా మహా! అల్లసాని*
*పెద్దన కవీంద్ర! యని నన్ను బిలుచునట్టి*
*కృష్ణ రాయలతో దివికేగలేక*
*బ్రతికి యున్నాడ జీవచ్ఛవంబు నగుచు*

కృష్ణదేవరాయల ఆస్థానంలో తెనాలి రామలింగనికి ఒక ప్రత్యేక స్థానం ఉండేది. గడ్డు సమస్యలొస్తే తిట్టుకవిత్వంతో సవాల్ చేసిన కవిని వాగ్వివాదంలో ఈ విధంగా ఓడించేవాడు తెనాలి రామలింగడు:

ప్రెగడ రాజు, నరసరాజులు అల్లుండ్లు. దేవర ఆస్థానానికి వచ్చి తమ గొప్పతనాన్ని పొగడు కొంటుంటే శ్రీరామలింగడు ఇలా వారించేడు.

*తెలియని వన్ని తప్పులని దిట్టతనాన సభాంతరంబునన్*
*బలుకగ రాకు రోరి పలుమాఱు పిశాచపు బాడె కట్టె! నీ*
*పలికిన చోట దుమ్ము పడ! భావ్య మెఱుంగవు, పెద్దలైన వా*
*రలు నిరసింతురా! ప్రగడ రాణ్ణరసా! విరసా! తుసా! బుసా!*

పెద్దన కవిత్వాన్ని మెచ్చుకుంటూ

*కవి యల్లసాని పెద్దన*
*కవి తిక్కన సోమయాజి గణుతింపంగా*
*గవి నేను రామకృష్ణుడ*
*గవి యను నామంబు నీరు కాకికి లేదే?*

వినమ్రతతో చెప్పుకున్నా ఆ అల్లసాని పెద్దనలో లోపాన్ని సూచిస్తూ ఇలా అన్నాడు రామకృష్ణుడు:

*ఎమితిని సెపితివికపితము*
*బ్రమపడక వెఱి పుచ్చకాయ వడి దిని సెపితో*
*యుమెతకయ తిని సెపితివో*
*యమవసనిసి యనెడి మాట యలసని పెదనా!*

ఒకే కన్ను గల తిరుమల రాయడు తనపై పద్యం చెప్పవలసిందని రామలింగని సతాయిస్తుంటే ఇలా చమత్కరించేడు:

*అన్నాతిగూడ హరుడగు*
*అన్నాతిని గూడకున్న నసురగురుండౌ*
*అన్నా తిరుమల రాయా*
*కన్నొక్కటి లేదు కాని కాంతుడు కాడే!*

(వచ్చే నెల కలగలుపు చాటువులు)